## అమెరికా అధ్యక్ష ఎన్నికలు

# రెండు పార్టీల ప్రజాస్వామ్యపు అసలు రూపం

**మరో** నెలలో అమెరికా పౌరులు రాగల నాలుగేళ్ళ తమనేలే అధ్యక్షుడెవరో నిర్ణయిస్తారు. చెప్పలేనంత హీనస్థాయిలో ఎన్నికల ప్రచారం సాగుతున్నది. బురద జల్లుకోవటం, ముద్రలు వేసుకోవటం, ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకపోవటం – ఈ ఎన్నికల ప్రచారం లక్షణాలుగా సాగుతున్నాయి.

అంతర్జాతీయ ద్రవ్యనిధి నివేదిక ప్రకారం, ప్రపంచ ఆర్థికవ్యవస్థలో ద్రవ్యేతర రంగంలో రుణం 2000నాటినుండి రెట్టింపుకు పెరిగింది. కోటిన్నర కోట్ల డాలర్లకు పెరిగింది. ఇది ప్రపంచ జిడిపి కంటే 225 శాతం ఎక్కువ. ఇది 2008 నాటి ఆర్థిక సంక్షోభంలాగా, మరోసారి మార్కెట్లు కుప్పకూలే స్థితికి దారితీయవచ్చని ఐఎంఎఫ్ హెచ్చరించింది. అంటే అమెరికా ప్రజలు, ప్రత్యేకించి యువత, మరిన్ని ఉద్యోగాలు కోల్పోతారు; ఆకలి, దారిద్ర్యం పెరుగుతాయి.

పెట్టుబడిదారీ ఆర్థికం కూలిపోయే ప్రమాదం పొంచి వున్నప్పటికీ, దీన్ని గురించి అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఎప్పుడూ చర్చ జరగలేదు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి  డోనాల్డ్ ట్రంప్ నిరుద్యోగసమస్యకు – వలస వచ్చినవారు, ఆసియా దేశాల నుండి వచ్చినవారు అమెరికా ఉద్యోగాలను పట్టుకుపోవటమే కారణంగా చూపెట్టి జాతీయోన్మాద రంగు పులిమాడు. డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి హిల్లరీక్లింటన్ కూడా ఇదే జాతీయ ఉన్మాదవైఖరి తీసుకుంది.

ఈ జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టడంతోపాటుగా, కార్మికవర్గ ఆందోళనలను వ్యతిరేకించే వైఖరినే ఇరువురు అభ్యర్థులు చేపట్టారు. ఒబామా ప్రభుత్వ విధానాల విజయాలుగా చెప్పబడే వాటినే తాను కొనసాగిస్తానని క్లింటన్ చెప్పుకుంటుండగా, ఒబామా పాలనలో ఆర్థికంగా దిగజారిన అంశాలను ట్రంప్ ఎత్తి చూపుతున్నాడు. తనమాట వినే ట్రేడ్ యూనియన్ల నాయకుల ద్వారా కార్మిక ఆందోళనలను అణచివేయాలన్న వైఖరి క్లింటన్ కలిగివుండగా, "శాంతిభద్రత"ల రక్షణకు పాశవిక నిర్బంధకాండతో కార్మిక ఆందోళనలను అణచివేయాలని ట్రంప్ చెబుతున్నాడు.

విదేశాలలో అమెరికా సామ్రాజ్యవాదం సాగిస్తున్న, సాగించబోతున్న యుద్ధాలకు ఎన్నికల ప్రచారంలో చోటులేదు. ఈ యుద్ధాలు దేశ ఆర్థికవ్యవస్థ మూలుగులను పీల్చివేస్తున్నాయి. అమెరికా ప్రజలు తమ శ్రమతో చెల్లించే పన్నులతోనూ, అమెరికన్ యువత తమ ప్రాణాలతోనూ మూల్యం చెల్లించాలి. అయినా యుద్ధాల మంచిచెడ్డలను ప్రజల చర్చకు అతీతం చేశారు.

ఎన్నికల ప్రచారంలో ఒక విషయం స్పష్టంగా బయటపడింది. అభ్యర్థులు ప్రజల ముందు ఒక వైఖరి చెబుతారు. దీనికి పూర్తిగా భిన్నమైన వాగ్దానాలను ప్రజల వెనుక చేస్తారు. వాల్‌స్ట్రీట్ కార్యనిర్వాహకుల (బూర్జువావర్గ ప్రతినిధుల)తో హిల్లరీ క్లింటన్ జరిపిన సమావేశం వివరాలు రహస్యంగా వుంచారు. వికీలీక్స్ దీనిని బయటపెట్టింది. బహిరంగసభలలో వాణిజ్యవేత్తలను అదుపుచేసే చర్యలను తీసుకుంటానని ప్రకటించిన క్లింటన్, ఈ సమావేశంలో వాణిజ్యవేత్తలకు అనుకూల విధానాలు చేపడతానని వాగ్దానం చేసింది. ఈ వివరాలు బయట పడటంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

ఈ విమర్శలను ప్రక్కదారి పట్టించేందుకు డోనాల్డ్ ట్రంప్ మహిళలపై చేసిన అసభ్యకర వ్యాఖ్యానాల టేపును విడుదల చేశారు. దీనికి ప్రతిగా ట్రంప్ హిల్లరీక్లింటన్ భర్త బిల్‌క్లింటన్ మహిళలతో సాగించిన వ్యవహారాలనూ, ఆ మహిళలను హిల్లరీ వేధించిన తీరునూ ముందుకు తెచ్చాడు. రిపబ్లికన్, డెమొక్రాటిక్ పార్టీలకు చెందిన నాయకులందరూ ఈ బురద జల్లుడులో పాలుపంచుకుని, అసలు సమస్యలు ప్రజల దృష్టికి రాకుండా చేశారు.

వీరి అసలు సమస్య – రాబోయే అధ్యక్షుడు ఏ చర్యలను, విధానాలను అమలు చెయ్యాలని అమెరికా పాలకవర్గాలు కోరుకుంటున్నాయన్నది. పాలకవర్గాలు నిర్దేశించిన విధానాలను ఎవరు – క్లింటన్ లేక ట్రంప్ – గెలిచినా  అమలుచేయాల్సిందే. కనుక  తమ ప్రయోజనాలను మరింత ఫలప్రదంగా అమలుజరపగల అభ్యర్థినే అమెరికా పాలకవర్గాలు ఎంచుకుని శ్వేత సౌధంలోకి పంపుతాయి. ఇదే రెండు పార్టీల ప్రజాస్వామ్యపు అసలు రూపం.

oooooo